పాలకుర్తి : కుక్కలగూడూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2005-2006 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

ముత్తారం : ముత్తారం జడ్పీహెచ్ఎస్ 2008-09 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

విద్యాసంస్థల్లో అ'పూర్వ' సందడి

ధర్మారం: నంది మేడారం జడ్పీ ఉన్నత పాఠశాల 1991-92 విద్యార్థులు

ఫర్టిలైజర్ సిటీ : నవోదయ శిశు విద్యాలయం 1990-2000 బ్యాచ్‌ల విద్యార్థులు

ధర్మారం:కొత్తూరు విద్యా భారతి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

ధర్మారం/పాలకుర్తి/ముత్తారం/ఫర్టిలైజర్‌సిటీ, మే 18: జిల్లాలోని పలు విద్యాసంస్థల్లో పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనాలు ఏర్పాటు చేసుకున్నారు. ఎస్సెస్సీ పూర్తయిన అనంతరం వివిధ వృత్తులు, ఉద్యోగాలు, వ్యాపారాలతో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా తాము చదువుకున్న పాఠశాలల్లో మళ్లీ కలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. రోజంతా ఆనందంగా గడిపారు. తమకు చదువు నేర్పిన గురువులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ధర్మారం మండలం నంది మేడారం జడ్పీహెచ్ఎస్ (92-93), కొత్తూరు విద్యా భారతి ఉన్నత పాఠశాల(2002-03), పాలకుర్తి మండలం కుక్కలగూడూర్ ప్రభుత్వ ఉన్నతపాఠశాల(2005-06), ముత్తారం జడ్పీహెచ్ఎస్ (2008-09) పదో తరగతి విద్యార్థులు, గోదావరిఖని ఎల్‌బీ నగర్‌లోని నవోదయ శిశు విద్యాలయం (1990-2000) విద్యార్థులు సమ్మేళనాలు ఏర్పాటు చేసుకున్నారు.

బొమ్మారెడ్డిపల్లిలో మరో 46 గొర్రెల మృత్యువాత

బాధితులను పరామర్శిస్తున్న విప్ లక్ష్మణ్ కుమార్

- 96 కు చేరిన మూగజీవాల మరణాలు
- మిగతా గొర్రెలకు చికిత్స
- రూ.15 లక్షల వరకు నష్టం
- బాధితులను పరామర్శించిన విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు

ధర్మారం, మే 18: మండలంలోని బొమ్మారెడ్డిపల్లిలో అస్వస్థతకు గురై మృతి చెందిన గొర్రెల సంఖ్య 96కు చేరింది. శనివారం 50 గొర్రెలు చనిపోగా, తాజాగా ఆదివారం మరో 46 మరణించాయని గొర్రెల పెంపకం దారులు తెలిపారు. మూగజీవాల మృతితో సుమారు రూ.15 లక్షల వరకు నష్టం వాటిల్లిందని పెంపకందారులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన ఐదుగురు గొర్రెల పెంపకందారులు సంయుక్తంగా 500 గొర్రెలను పెంచుతూ ఉపాధి పొందుతున్నారు. రోజు మాదిరిగానే గ్రామ శివార్లలో కోసిన వరి పొలాలలో గొర్రెలను మేత మేపుతున్నారు. శనివారం సాయంత్రం సమయంలో మందకు వచ్చిన తర్వాత అస్వస్థతకు గురై 50 గొర్రెలు మరణించాయి. అప్పటికే మరికొన్ని గొర్రెలు కూడా అస్వస్థతకు గురై మందలోనే ఉన్నాయి. మరుసటి రోజు పరిస్థితి విషమించి మరో 46 గొర్రెలు కండ్ల ముందే చనిపోవడంతో పెంపకందారులు ఆవేదన వ్యక్తం చేశారు. కొమ్ము రాజేశం, , రేషవేణి మల్లేశం, కొమ్ము కనకయ్య, సమ్మెట కొమురయ్య, దాడి నాగయ్యతో పాటు పాటు మరో పెంపకం దారుడికి సంబంధించిన గొర్రెలు చనిపోయాయి. పెద్దపల్లి పశు సంవర్ధక శాఖ అధికారి డీ శంకర్ ఆధ్వర్యంలో వెటర్నరీ డాక్టర్లు అజయ్,అనిల్, ఎండీ అజహరుద్దీన్ మిగతా గొర్రెలకు చికిత్స అందించి మందులు పంపిణీ చేశారు. మూగ జీవాల మృత్యువాతకు గల కారణాలు తెలుసుకోవడానికి డాక్టర్లు మూడు గొర్రెలను అక్కడే పోస్టుమార్టం చేశారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గ్రామానికి వెళ్లి బాధితులతో మాట్లాడారు. బాధితులకు పరిహారం కోసం కలెక్టర్‌తో ఆయన ఫోన్ లో మాట్లాడారు. సాధ్యమైనంతవరకు ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. అంతకుముందు యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం, యాదవ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు మారం తిరుపతి, నాయకులు సందినేని కొమరయ్య, వేల్పుల నాగరాజు, జంగ మహేందర్ తదితరులు గ్రామానికి వెళ్లి పెంపకం దారులను పరామర్శించారు.బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. మూగజీవాల మృత్యువాతకు గల కారణాలను వారు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ నంది మేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు గాగిరెడ్డి వేణు గోపాల్ రెడ్డి, దాడి సదయ్య,మాజీ ఉప సర్పంచ్‌లు ఆవుల లత, బత్తిని తిరుపతి, గొర్ల కాపరుల సొసైటీ అధ్యక్షుడు రాధారపు లింగయ్య,పుట్ట కొమురయ్య, సంకరి నర్సింగం, రాధారపు బుచయ్య, గాజంగి లచ్చయ్య పాల్గొన్నారు.

సినీ నటుడు రాజేంద్రప్రసాద్‌కు సన్మానం

రాజేంద్రప్రసాద్‌తో పుట్ట దంపతులు

మంథని, మే 18: ప్రముఖ తెలుగు సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్‌ను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, మంథని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పుట్ట శైలజలు ఆదివారం సన్మానించారు. శనివారం రాత్రి రాజేంద్రప్రసాద్ మంథనిలోని రాజగృహకు చేరుకోగా, పుట్ట దంపతులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుట్ట మధూకర్, పుట్ట శైలజ రాజేంద్ర ప్రసాద్‌ను సన్మానించారు. పుట్ట దంపతులు ఆతిథ్యాన్ని ఆయన స్వీకరించారు. రాజేంద్రప్రసాద్ రాజగృహకు చేరుకోగా పలువురు ఆయనతో సెల్ఫీలు దిగారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న యాదవ సంఘం నాయకులు

ఇచ్చిన హామీలు విస్మరించిన కాంగ్రెస్

ఓదెల, మే18: రాష్ట్రంలో 16శాతం జనాభా ఉన్న యాదవుల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు రాములు ఆరోపించారు. మండలంలోని మడకలో ఇటీవల కరెంట్ తీగలు తెగిపడి వేల్పుల రాజకొమురయ్యకు చెందిన 25 గొర్రెలు చనిపోయాయి. యాదవ సంఘం నాయకులు రాజకొమురయ్య కుటుంబానికి రూ ఆదివారం రూ. 10వేలు సాయం అందజేశారు. అనంతరం రాములు మాట్లాడారు. ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల సమయంలో యాదవులకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఏడాది గడుస్తున్నా యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. నామినేటెడ్ పదవుల్లో యాదవులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ, ఇతర కార్పొరేషన్ పదవుల కేటాయింపులో యాదవులను విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రేస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రూ. 5వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూత్ రాష్ట్ర నాయకుడు పెగడ రమేశ్ , మాజీ జడ్పీటీసీ గంట రాములు , యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇష్టా రాజ్యంగా మట్టి తరలింపు

ఓదెల, మే18: ఓదెల మండలంలోని కొలనూర్ గ్రామంలోని అప్పమాయ చెరువు లో ఇష్టారాజ్యంగా నల్లమట్టిని తరలిస్తునన్నదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఆరోపించారు. ఆదివారం చెరువును సంజీవరెడ్డి సందర్శించారు. ఇక్కడి మట్టిని ఇటుక బట్టీలకు సరైన నిబంధనలు లేకుండానే జిల్లా అధికారులు పర్మిషన్ ఇచ్చారని పేర్కొన్నారు. చెరువు మట్టి తరలింపు సందర్భంగా టిప్పర్ల లో ఎంత పరిమాణం తీసుకు వెళ్లాలో స్పష్టంగా లేదని అన్నారు. ఎక్కడ లేని విధంగా జిల్లా అధికారులు ఇక్కడ చెరువు మట్టి తరలింపులో సరైన నిబందన పాటించక పోవడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. మట్టి తరలింపు సందర్భంగా వచ్చిన ఆదాయాన్ని గ్రామం లోని శివాలయం నిర్మాణానికి ఇవ్వాలని కోరారు. ఆయన వెంట గ్రామస్తులు ఉన్నారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

పాలకుర్తి, మే 18: బసంత్‌నగర్ ఐఎంఎస్ఎస్ పాఠశాల, జీడీనగర్‌లోని యూనివర్సల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఐఎంఎస్ఎస్ప్రిన్సిపాల్ మహేంద్రన్, యూనివర్సల్ కరస్పాండెంట్ ఇస్మాయిల్ పేర్కొన్నారు. ఈనెల 19 నుంచి 21వరకు మెదక్‌జిల్లాలోని తుఫ్రాన్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఐఎంఎస్ఎస్‌కు చెందిన కె. సాయిప్రతీక్, కె. సాయిప్రణ్, ఎం. అంజన్‌సాయిగౌడ్, టి. అభినవ్‌కుమార్, వి. రిషికేష్, డి. సాయివేదాంత, టి. ఆసిఫ్, పి. సాత్విక్, డి. నిక్షయ్, జి.నితియాస్‌గౌడ్‌లు ఎంపికయ్యారు. యూనివర్సల్ పాఠశాల నుంచి గౌరిక్ ఎంపికయ్యారు. వ్యాయామ ఉపాధ్యాయులు క్రిష్ణమూర్తిగౌడ్ రాష్ట్రస్థాయి ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ఖనిలో మెగా జాబ్‌మేళా

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, సింగరేణి సీఎండీ

గోదావరిఖని, మే 18: గోదావరిఖని, పరిసర ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సింగరేణి యాజమాన్యం ఆదివారం స్థానిక జవహర్‌లాల్ నెహ్రూస్టేడియంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఉదయం 6నుంచి యువకులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. హైదరాబాద్‌కు చెందిన దాదాపు 100 ప్రైవేట్ కంపెనీలు పాల్గొనగా, సుమారు 8వేల మంది వరకు నిరుద్యోగులు హాజరయ్యారు. ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేసి 3వేల మందిని ఎంపిక చేసుకున్నారు. వారికి ఉద్యోగ ఉత్తర్వులు అందజేశారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ప్రభుత్వ సలహాదారుడు హర్కర వేనుగోపాల్‌రావు, సింగరేణి సీఎండీ బలరాం, రామగుండం రీజియన్ జీఎంలు జ్యోతిప్రజ్వలన చేసి జాబ్‌మేళాను ప్రారంభించారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు నియామక పత్రాలను అందుకొని సంతోషం వ్యక్తం చేశారు. ఇక్కడ సింగరేణి డైరెక్టర్లు కే వెంకటేశ్వర్లు, కే రాజ్‌కుమార్, ఆర్జి-1,2,3 జీఎంలు లలిత్‌కుమార్, సుధాకర్‌రావు, బండి వెంకటయ్య, ఐఎన్టీయూసీ ఆర్జీ-1 ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్, ఉపాధ్యాక్షులు సదానందం, పెద్ది నర్సింహులు, సీఎండీఎఐ జనరల్ సెక్రటరీ, హెచ్ఆర్‌డీ జీఎం రఘుపతి, ఎస్ఓటు జీఎం గోపాల్ సింగ్, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, నోబెల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్‌మెంట్ సురేశ్, ఏఐటీయూసీ బ్రాంచీ సెక్రటరీ ఆరెల్లి పోశం, తదితరులు ఉన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధమా..?

- రొంపికుంట అభివృద్ధి పై కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ సవాల్
- 40 ఏండ్లలో చేయలేని అభివృద్ధి నాలుగేండ్లలో చేసిన పుట్ట మధు

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కమాన్‌పూర్, మే 18 మండలంలోని రొంపికుంటలో ఎవరి పాలనలో ఎంత అభివృద్ధి జరిగిందో తేల్చుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. రొంపికుంటలో బీఆర్ఎస్ నాయకులు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మంథని నియోజకవర్గం ఏర్పడిన నాటి నుండి ఎక్కువ కాలం ఎమ్మెల్యేలుగా పరిపాలించిది కాంగ్రెస్ నాయకులేనన్నారు. రాష్ట్రంలో ఉన్నత పదవుల్లో కొనసాగినప్పటికి వారి స్థాయిలో రొంపికుంట గ్రామ అభివృద్ధికి పెద్దగా చేసింది ఏమీలేదని విమర్శించారు. 40 ఏళ్ల పాటు దుద్దిళ్ల కుటుంబం నుంచే ఎమ్మెల్యేలుగా కొనసాగారన్నారు. నాలుగేండ్లు మాత్రమే పుట్ట మధు ఎమ్మెల్యేగా పని చేశారని చెప్పారు. ఈ కాలంలోనే రొంపికుంట లక్షలాది రూపాయలు మంజూరు చేయించి గ్రామ అభివృద్ధికి దోహదపడ్డారని గుర్తు చేశారు. రొంపికుంటలో సిమెంట్ రోడ్లు, పాఠశాలల్లో గదులు, సామాజిక భవనాల నిర్మాణాలకు ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేశారని వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతున్నా రొంపికుంటలో నయాపైసా అభి వృద్ధి చేయలేదన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడడం సరైంది కాదన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చినా హామీలు అమలవుతున్నాయా అని ప్రశ్నించారు. గ్రామంలో ఎంతమంది రైతులకు రూ, 2 లక్షల రుణమాఫీ వర్తించిందో చెబుతారా అని ప్రశ్నించారు. కల్యాణ లక్ష్మి పథకంలో తులం బంగారం ఇస్తామని చెప్పారని, ఎంత మందికి ఇచ్చా రో చెప్పాలన్నారు. మహిళలకు రూ. 2500 ఇస్తున్నారా అని ప్రశ్నించారు. 420 హామీలపై కాంగ్రెస్ నాయకుల వద్ద సమాధానం ఉందా అని ప్రశ్నించారు. పుట్ట మధు మంథని ఎమ్మెల్యేగా కొనసాగిన నాలుగేండ్ల కాలం, జడ్పీచైర్మన్ గా కొనసాగిన కాలంలో ఎంతో మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో ఎల్‌వోసీ, సీఎంఆర్ఎఫ్ అంటే ప్రజలకు తెలియదన్నారు. పుట్ట మధు హయాంలో గ్రామంలో అభివృద్ధే జరగలేదని కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం వారి అవివేకానికి నిదర్శమన్నారు. స్థాయిని మరిచి కాంగ్రెస్ నాయకులు మరోసారి పుట్ట మధు పై అర్థరహిత విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ రొంపికుంట గ్రామ శాఖ అధ్యక్షుడు కొయ్యడ రవి యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిందం తిరుపతి, నాయకులు పులిపాక రాయలింగు, కొయ్యడ కుమార్ యాదవ్, చొప్పరి తిరుపతి, కొండి అనిల్, ఊరడి శ్రీనివాస్, పులిపాక మల్లయ్య, జంగిలి శ్రీనివాస్, కొండి సంపత్‌తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవే భగవత్ యూత్ లక్ష్యం

భగవత్ యూత్ నూతన కార్యవర్గం

జ్యోతినగర్, మే 18: సామాజిక సేవయే ముందుకు సాగుతున్నట్లు భగవత్ యూత్ ప్రెసిడెంట్ కొంకటి రవిగౌడ్ తెలిపారు. ఆదివారం ఎన్టీపీసీలోని శ్రీమయి కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం భగవత్ యూత్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2008 ఆగస్టు 2న సామాజిక సేవ ప్రేమికులతో భగవత్ యూత్ ఏర్పాటైనట్లు తెలిపారు. సామాజిక సేవను మరింతగా ముందుకు నడిపించేందుకు కొత్త కార్యవర్గాన్ను ఎంపిక చేశామని నూతన కార్యవర్గం జాబితాను వెల్లండించారు. అధ్యక్షుడిగా కొంకటి రవిగౌడ్, ప్రధానకార్యదర్శిగా పైడ సాయి, కోశాధికారిగా బత్తిని చంద్రశేఖర్, బుద్దె సతీశ్, ఉపాధ్యక్షులుగా మామిడాల గణేశ్, ఇలియాస్‌బేగ్, కొంతం సాయినాథ్‌రెడ్డి, కార్యనిర్వహక కార్యదర్శులుగా మామిడాల వెంకటేశ్, అనుమల చంద్రశేఖర్, మడుపు శివరామకృష్ణ, సహాయ కార్యదర్శులుగా యెగ్గడి చంద్రమోహన్, గాజుల శ్రీనివాస్ యాదవ్, ధర్మాజీ అరుణ్, సంయుక్త కార్యదర్శులుగా సింపెల్లి శ్రీకాంత్‌రావు, మాడిశెట్టి వంశీ, ఆరెళ్ల సాయి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నడిపెల్లి సాగర్‌రావు, పెట్టెం శ్రీనివాస్, రాధిక తిరుపతి, వొల్లాల సురేశ్, నడిపెల్లి అభిషేక్‌రావు, ఆడెపు పరంధాములు, మాచిడి మహేందర్‌గౌడ్, శంకర్, గోపాల్‌కృష్ణ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మంథని రూరల్, మే 18: రచ్చపల్లి ఆర్ అండ్‌ఆర్ కాలనీకి చెందిన కన్నబోయిన రాజం ఇటీవల మృతి చెందాడు. ఆదివారం దశ దినకర్మ కార్యక్రమం నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆ కుటుంబాన్ని పరామర్శించా రు. ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులున్నారు.

లాలపల్లెలో..

ఎలిగేడు, మే 18 : మండలంలోని లాలపల్లె మాజీ సర్పంచ్ మీసరగొండ మల్లేశం భార్య అనారోగ్యంతో మృతి చెందింది. పెద్దపెల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆదివారం మృత దేహానికి పూల మాల వేసి నివాళు అర్పించారు కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు.ఆయన వెంట మాజీ ఎంపీపి తానిపర్తి స్రవంతి మోహన్ రావు, బద్దం తిరుపతి రెడ్డి ,బాసంపెల్లి రాజేశ్, బాసంపెల్లి వినోద్,కవ్వంపెల్లి బాపయ్య, న్యాతరి పోచాలు,కిష్టయ్య ఉన్నారు.

ప్రణాళికా బద్ధంగా రామగుండం అభివృద్ధి

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, మే 18: రామగుండం నగరంలో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన ప్రణాళికబద్ధంగా కొనసాగుతున్నదని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. రూ.50.50 లక్షలతో పలు పార్కుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి 26వ డివిజన్ దుర్గానగర్ పార్కు వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఈ రామన్, డీఈ షాబాజ్, ఏఈ తేజస్విని, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, మాజీ కార్పొరేటర్లు, దుర్గానగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

ధర్మారం,మే18:రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ కార్యకర్త నస్పూరి మొండయ్య కుమారుడు అరవింద్‌ను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. ఇటీవల అరవింద్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్ గచ్చిబౌలిలోని కేర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఈశ్వర్ ఆదివారం దవఖానకు వెళ్లి బాధితుడిని పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లకు సూచించారు. సదరు యువకుడు త్వరగా కోలుకోవాలని ఈశ్వర్ ఆకాంక్షించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

గోదావరిఖని, మే 18: అశోక్‌నగర్‌లోని జామా మసిద్, అహ్లె హదీస్‌లో ఆదివారం గోదావరిఖనికి చెందిన భవ్య కంటి దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. దాదాపు 150మందికి పైగా కంటి వైద్యనిపుణులు కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇక్కడ మసీదు కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రావూఫ్, ప్రధానకార్యదర్శి ఎండీ ఫయాజ్ అలీ, కార్య వర్గ సభ్యులు ఎండీ నవాబ్, ఎండీ ఘని, ఎండీ రఫీ, హక్కిం, యాసిన్, మౌలానా, అబిద్, ముత్తల్లిబ్, షహీద్ ఉన్నారు.

కుటుంబ సభ్యులతో శతాధిక వృద్ధురాలు ఎర్రం వెంకటమ్మ

నాలుగో తరంతో వండేళ్ల బామ్మ

ఇప్పటికీ తన పనులు తానే చేసుకుంటుఉన్న శతాధిక వృద్ధురాలు

సుల్తానాబాద్ రూరల్, మే18:ఈతరం యువత చిన్న చిన్న పనులకే అలసిపోతున్నారు. కానీ ఈ శతాధిక వృద్ధురాలు మాత్రం ఇప్పటికీ తను పనులు తానే చేసుకుంటూ ఆరోగ్య జీవిస్తు అందరికీ ఆదర్శంగా నిలుస్తుంది. నాలుగో తరం వాళ్లతో కలిసి సరాదగా గడుపుతున్నది ఓ బామ్మ. మండలంలోని ఐతరాజ్‌పల్లి గ్రామానికి చెందిన ఎర్రం వెంకటమ్మ వయసు 100 ఏళ్ల దాటింది. ఈ వయసులోనూ ఎవరి సహాయం కోరకుండా తన పనులు తానే చేసుకుంటున్నది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ వాళ్లం దరూ ఆదివారం గ్రామానికి వచ్చి వ్యవసాయ పంట పొలాల వద్ద ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాతజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వెంకటమ్మ బిడ్డలు, వాళ్ల, వాళ్ల పిల్లలంతా ఒకే చోట కలుసుకున్నారు. అందరితో కలిసి బామ్మ సరదాగా గడిపింది. ఈ కార్యక్రమంలో కూతుళ్లు సత్యమ్మ, భాగమ్మ, విజయ, మనుమలు, మనవరాళ్లు, దాసరి మధుసూదన్ రెడ్డి, మధుకర్ రెడ్డి, అజయ్ రెడ్డి, లక్ష్మణ్ రెడ్డి, శశికాంత్ రెడ్డి, హరిక, పద్మ, రజిత, స్వప్నలతో పాటు తదితరులు ఉన్నారు.

జనుము, జీలుగ, పెసర విత్తనాలు సిద్ధం

పాలకుర్తి, మే18: పాలకుర్తి మండలంలోని పుట్నూర్ డీసీఎంఎస్ గోదాంలో రైతులకు జనుము, జిలుగు, పెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయశాఖ అధికారి ప్రమోద్‌కుమార్ తెలిపారు. మండల రైతులు వరినాట్లకు ముందుకులు చదును చేసుకొని, జనుము, జిలుగు, పెసర విత్తనాలు వేసుకోవడం ద్వారా భూమి సారవంతం అవుతుందని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పాసుబుక్ జిరాక్స్‌తో పుట్నూర్ గోదాంలో సంప్రదించాలని కోరారు.